

# బస్తీలో సంక్రాంతి

ఎం. కుసుమ.

"ఏమండోయ్! పెద్ద పండగొచ్చేసింది!"

"ఆ! ఆ! వచ్చిందొచ్చింది. ఇప్పుడేం? ఇరవైరోజుల్నాడే వచ్చేసింది."

"మరి! మీ వాకిట్లో పేడనీళ్ళు జల్లి, ముగ్గు లెడుతున్నట్లు లేదేం?"

"నయమే! మేముంటున్నది నాలుగు అంతస్తుల మేడ మీదున్న ఓ చిన్న పోర్షన్‌లో. స్లాబ్ మీద పేడ జల్లితే, ఇంటావిడ తంతుంది."

"పోనీ నాలుగిళ్ళవాళ్ళూ కలిసి, ఆ ప్రహరీలోనైనా కాస్త పిండిముగ్గెట్టకపోయారా?"

"ఏమిటీ? పిండిముగ్గేనా? అంటే ముగ్గు పిండితో. ఇదివరకు 10 పైసల కొచ్చేది. ఇప్పుడు శేరు 60 పైసల వరకూ పోయింది గదా! అదయినా నల్లగా, కళా కాంతీ లేకుండా, బొత్తిగా గోడ బెత్తికల పొడిలా ఉంటోంది."

"కాస్త బియ్యప్పిండి కలపాలి మరి!"

"మరే! కిలో రెండున్నర, మూడున్నర పెట్టి కొనుక్కుంటూ, తిండానికే, వెనకాడవలసి వస్తోంటే, ఇక పిండికొట్టి ముగ్గుల్లో కలిపేమంటే, నోట్లో కరక్కాయే! వెదుక్కోవాలిహ కర్రా, ఓ చిప్పా, ఓ జోలేనూ!"

"మీ పిల్లలు గొబ్బెమ్మ లెడుతున్నారా?!"

"అవుపేడెక్కడ తెస్తాం? అద్దెకున్న వాళ్ళందరం కలిసి, యింటికో రూపాయిస్తాం — ఈ నెల రోజులూ కాస్త అవుపేడ తెమ్మని బ్రతిమాలేమా?—మా పాలు పోసేది, వాళ్ళింట్లోదే బర్రె పేడ తెస్తోంటే, కళ్ళారా చూసి, ఇహ మానేశాం! చెప్పొద్దూ! లేనిపోని పాప ఖర్మం కూడానూ! పిదపకాలం పాడుబుద్ధులూనూ. పేడ కనిపించిందా, ఒక్కోసారి, ఎద్దుపేడా, దున్న పేడా కూడా తెస్తోందట. మా చిన్నాడన్నాడు."

"బాగానే వుంది. మరి బొమ్మల కొలువో!"

"భలేవారండి వదినగారూ! మనిళ్ళే బొమ్మరిళ్ళు! మాటవరసకు నాలుగే కాని, ఈ నాలుగంతస్థుల మేడలోను, పదిళ్ళ వాళ్ళం కాపరా లుంటున్నాం — ఇంటివాళ్ళు కాక! వందలకొద్దీ అద్దెలే గాని, ఇల్లు వసతేదీ? ఒక మనిషింట్లోకి వెళితే, ఇద్దరు బయటకి రావల్సివచ్చే. పొదరిండ్ల వంటి ఇళ్ళలో మనమే ఓ బొమ్మలం! ఇక బొమ్మలెక్కడ పెడతాం చెప్పండి!"

"పోనీ, మీ కూతుర్నీ అల్లుణ్ణీ పండక్కి పిలిచేరా?"

"ఏదో మేం పిలిచాం! కాని రావడానికి వాళ్ళకే ఛార్జీలు అవీ చాలవుట! చిన్న ఉద్యోగమేగా అతగాడికీని. ఇక్కడ గంపెడు సంసారంతో మా పరిస్థితీ అలాగే వుంది. ఛార్జీలెక్కడ పంపం? ఓ 50 రూపాయలు పంపించి బట్టలు కుట్టించుకోమన్నాం!

"అంతేలెండి! ఏంచేస్తాం? మీ పెద్దబ్బాయి తిరుపతిలో చదువుతున్నాడన్నారుగా? పండక్కి రాడా? మరి!"

"ముందే చెప్పొగదండీ! ఛార్జీలెక్కడ పోస్తాం? వాడికి గుడ్డలక్కూడా డబ్బు పంపలేక పోయామీసారి!"

"పోనీ, పండక్కి స్వీట్సు ఏంచేస్తున్నారేం?"

"రామ! రామ! చక్కెర కార్డు పట్టుకుని, క్యూలో నించున్న కుర్రాడికి శోషొచ్చి ఇంటి కొచ్చేసేడు మొన్న. మర్నాడెడితే, చక్కెర స్టాక్ లేదని, ఒక కిలో ఇచ్చి పంపేరుట. బెల్లం అసలే దొరక్కపోతూంటే ఇహ స్వీట్స్ ఏమిటండీ?"

"పోనీ, కారంగా ఏదైనా?"

"నూనె లీటరు 10 రూపాయిల దాకా పెరుగుతోంటేనూ? ఏ పకోడీలో పడేసుకుందామన్నా వెధవది వుల్లిగడ్డలు రూపాయిన్నరా — మళ్ళీ మాట్లాడితే రెండూనూ. ఏ కూర కొందామన్నా, మార్కెట్‌కి వెడితే, కిలో రెండూ, ఒకటిన్నరా. నలుగురున్న వాళ్ళం, ఇంకేమిటండీ తినేది?"

"పోనీండి. ఈ జన్మకింతే! ఓ మంచి గుమ్మడికాయకు ఓ రవ్వంత బంగారం అంటించి సద్బ్రాహ్మణుడికి దానమిచ్చుకుంటే, వచ్చే జన్మకు గుమ్మడిపండంత బంగారం కలుగుతుందిట?"

"మరేం? బంగారమే కద! ఏం భాగ్యం లెండి! దిన వెచ్చాలకి పుస్తె లమ్ముకునే రోజులు రాకుంటే అదే పదివేలు. రోజెలా వెళ్తుందిరా ఈ దిక్కుమాలిన ధరల్తోటీ, అని ఛస్తుంటే, బంగారం దానం చేస్తుందట ఈవిడ! గుమ్మడి 'కాయ' దాకా ఎందుకండీ, ఓ చిన్న చెక్క రెండు రూపాయ లన్నాడొకడు మొన్న మార్కెట్టులో. ఏదో భోగినాడు మంచి గుమ్మడి వండా లంటారుకదాని, ఓ చిన్న చెక్క తెండీ అంటే, 'ఇహ నోర్మూయ్!' అన్నారు మా వారు. అన్నీ తెలిసే అలా అంటావేవిటంటూ. ఇహ! అన్నీ పై జన్మకే వేద్దాం వాయిదాలు."

"వ్చ! ఏమిటో! మరీ కరువు కాలమొచ్చి పడింది. ఈ మహా పట్నాలలో అన్నిటికీ అంగలార్చడమే లాగుంది సామాన్యుడి బ్రతుకు."

"మమ్మల్నిన్ని ప్రశ్నలు వేసేరు గదా? పండక్కి మీరేం చేస్తున్నారో చెప్పేరుగారేం వదిన గారూ."

"హుం! ఇహ మొదలుపెట్టండి. మీ ప్రశ్న పరంపర. నేనూ చెబుతానిక జవాబులు...." ■